VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ మార్చి 12 బుధవారం 2025
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 228
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



# కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలం

**గత 14 నెలల పాలనలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు.**

హైదరాబాద్: గత 14 నెలల పాలనలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇవ్వని హామీలను కూడా భారాస ప్రభుత్వ హయాంలో అమలు చేశామని.. కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలనే అమలు చేయలేక చేతులెత్తేసిందని విమర్శించారు. బుధవారం నుంచి అసెంబ్లీ, మండలి సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. మంగళవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన భారాస శాసనసభాపక్ష సమావేశం జరిగింది. సుమారు 3 గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అధినేత దిశానిర్దేశం చేశారు.

“భారాస ప్రభుత్వ హయాంలో రైతును రాజును చేశాం. సాగునీరు, 24 గంటల కరెంటు, రైతుబంధు, గిట్టుబాటు ధర అందించాం. ఇప్పుడు కాంగ్రెస్ 14 నెలల పాలనలో రైతులు అరిగోస పడుతున్నారు. మనం హామీ ఇవ్వని.. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటి పథకాలను అమలుచేసి ప్రజలకు సంక్షేమాన్ని అందించాం. రాష్ట్రంలో రెండుసార్లు కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహించాం. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రూ.2,500 ఇస్తామన్న హామీని అమలుచేయడం లేదు. పింఛన్ పెంపు లేదు. గురుకులాలను మనం అద్భుతంగా తీర్చిదిద్దితే.. కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టుపట్టించింది. గురుకుల విద్యార్థులు ఆకలికేకలతో అలమటిస్తున్నారు. రైతులు, నేతన్నలు, విద్యార్థులు, ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మిషన్ భగీరథ ద్వారా మన ప్రభుత్వం ఇంటింటికీ తాగునీరు అందిస్తే.. కాంగ్రెస్ సర్కారు వైఫల్యంతో ప్రజలు తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రభుత్వంలో విద్యుత్ కోతలు పెరిగిపోయాయి. మన హయాంలో పరిశ్రమలను పెద్దఎత్తున తీసుకొస్తే.. ఇప్పుడు అవి ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. రాజీలేని పోరాటం చేయాలిప్రజాసమస్యలపై రాజీలేని పోరాటం చేయాలి. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి, ప్రజావ్యతిరేక కార్యక్రమాలపై చీల్చి చెండాడాలి. భారాస మీద సర్కారు చేస్తున్న తప్పుడు నిందలను తిప్పికొట్టాలి. రాష్ట్రంలో నెలకొన్న పలు సమస్యలపై అసెంబ్లీ, మండలిలలో కొట్లాడాలి. ఎండిన పంటలు, అందని కరెంటు, దక్కని సాగునీరు, కాలిపోతున్న మోటర్లు.. తదితర రైతు సమస్యలు, తాగునీటి కొరతపై సభల్లో గొంతు వినిపించాలి. బీసీ, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లులకు మద్దతుగా గళం విప్పాలి. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమవుతున్న తీరుపై నిలదీయాలి. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏల పెండింగ్, పీఆర్సీ అమలుపై సర్కారును ప్రశ్నించాలి. మహిళలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని ఒత్తిడి తేవాలి. విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయక పోవడం, వైద్య రంగంలో దిగజారుతున్న ప్రమాణాలు, దళిత బంధును నిలిపివేయడం, గొర్రెల పెంపకం, చేపల పంపిణీ వంటి వాటిపై అసెంబ్లీ, మండలిలలో ప్రభుత్వాన్ని నిలదీయాలి.



**మనం ఇవ్వని హామీలూ అమలుచేశాం**
**ఈ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల పైనా చేతులెత్తేసింది**
**సభలో ప్రజాసమస్యలపై నిలదీయాలి**
**బీసీ, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లులకు మద్దతు**
**భారాస శాసనసభాపక్ష సమావేశంలో కేసీఆర్ దిశానిర్దేశం**

# రూ.6 వేల కోట్లతో
## రాజీవ్ యువ వికాసం

**రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రాష్ట్రంలో ఐదు లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగులకు రూ.6 వేల కోట్లు అందిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క వెల్లడించారు.**

**15 నుంచి ఏప్రిల్ 5 వరకూ దరఖాస్తుల స్వీకరణ**
**జూన్ 2న లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ**
**ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క వెల్లడి**

హైదరాబాద్: రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రాష్ట్రంలో ఐదు లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగులకు రూ.6 వేల కోట్లు అందిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్ కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. “యువత అభ్యున్నతి గురించి గత భారాస ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్లను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల నిరుద్యోగ యువతీ, యువకులు స్వయంఉపాధి పథకాలు అందక ఇబ్బందులు పడ్డారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి గరిష్ఠంగా రూ.3 లక్షల వరకూ ఆర్థిక సాయం అందించాలని మా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 15న నోటిఫికేషన్ విడుదల చేస్తాం. నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో వచ్చే నెల 5 వరకు దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తాం. లబ్ధిదారుల ఎంపికకు మార్గదర్శకాలను అధికారులు రూపొందిస్తున్నారు.

చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయంలోని వారసత్వ కట్టడాన్ని పరిశీలిస్తున్న భట్టివిక్రమార్క. చిత్రంలో ఎంపీ బలరాం నాయక్, వీసీ సూర్యా ధనంజయ్

చాకలి ఐలమ్మ వర్సిటీలోని వారసత్వ భవనాలను పునరుద్ధరిస్తాం

చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం నిర్మాణానికి రూ.540 కోట్లు మంజూరు చేశాం. దేశంలోనే ఉత్తమ వర్సిటీగా తీర్చిదిద్దడంలో భాగంగా ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రూపొందించింది. వర్సిటీలోని వారసత్వ(హెరిటేజ్) భవనాలకు మరమ్మతు చేసి పునరుద్ధరిస్తాం. ప్రధాన ద్వారం మూసీ నదికి దగ్గరగా ఉంది. పునరుజ్జీవ పథకం పూర్తయిన తర్వాత దాన్ని తిరిగి తెరుస్తాం. ప్రాంగణంలో ఉన్న వారసత్వ కట్టడాల పునరుద్ధరణకు రూ.15.5 కోట్లు, నూతన భవన నిర్మాణాలకు తక్షణమే రూ.100 కోట్లు విడుదల చేస్తున్నాం” అని భట్టి వెల్లడించారు.

## రెండునెలల్లో ట్రిపుల్ ఆర్‌కు అనుమతులు




**కేంద్రమంత్రి గడ్కరీ హామీ ఇచ్చారు**
**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి**

## నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం: ఏలేటి




**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావే శాల్లో బిజెపి క్రియా శీల పాత్రపో షిస్తుందని బిజెపి స్పష్టం చేసింది. గవర్నర్ ప్రసంగంలో మంచిచె డులను విశ్లేషించి స్పంది స్తామని బిజెఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో మాట్లాడుతూ.. గడిచిన డిసెంబర్‌లో మొదటి సారి గవర్నర్ ప్రసంగంలోని అంశాల ఆధారంగా సీఎం రేవంత్ రెడ్డి సంగతి తేలుస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం మీద నెపం తెచ్చే ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామిలపై మాట్లాడాలన్నారు. బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట్లాడుతూ..అంతకు ముందు కాళేశ్వరం మీద అఖిల పక్షం టూర్ పెట్టారని.. ఇప్పుడు ప్రభుత్వానికి ధైర్యం ఉంటే రాష్ట్రంలో 12 వేలకు పైగా గ్రామాల్లో ప్రభుత్వ పనితనంపై అఖిల పక్షం టూర్ పెట్టాలని.. తాము వస్తామని అన్నారు. ఫామ్ హౌస్‌లో పడుకున్న వాళ్ళ గురించి తాము మాట్లాడమని పరోక్షంగా మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కరెంటు, నీళ్లు, విద్య, ఉద్యోగం, రైతాంగం, మహిళలు, నిరుద్యోగ యువత, సంక్షేమ పథకాలపై ప్రతి పక్ష పార్టీగా తామే మాట్లాడతామని అన్నారు. రాష్ట్రం విడిపోక ముందు రూ 800 కోట్లు ఉంటే 2014 తరువాత రూ. 5 వేల కోట్లకు కేటాయింపులు పెరిగాయన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్య మంత్రి అయ్యాక ఎన్ని వేల కోట్లు అప్పులు చేసారో సభలోనే చర్చిద్దామని అన్నారు.

# నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
## అసెంబ్లీ ముందు ఆందోళనలు, ధర్నాలు నిషేధం

**హైదరాబాద్:** శాసనసభ సమావేశాలు జరిగినన్ని రోజులు అసెంబ్లీ ఆవరణలో ఎలాంటి ఆందోళనలు, నిరసనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో సభ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై పోలీసు, ఇంటెలిజెన్స్ అధికారులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ బండా ప్రకాశ్, సీఎస్ శాంతికుమారి,ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలు జరిగినన్ని రోజులు సభ లోపల, వెలుపల శాంతియుత వాతావరణం ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శాసనసభకు సకాలంలో చేరుకొనేలా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. బడ్జెట్ సమావేశాలు ఎక్కువ రోజులు జరుగుతాయని, గతంలో మాదిరిగానే ఈ సమావేశాలకు ప్రభుత్వం, అధికారులు సహకరించాలని కోరారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని,

సమాచారాన్ని తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో ముద్రించాలని అధికారులకు సూచించారు. శాసన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ... సమావేశాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా పని చేయాలన్నారు.

మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని సూచించారు. సభ సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారాన్ని అందిస్తామని శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.






## అమెరికా స్టాక్ మార్కెట్లలో భారీ కుదుపు

# మారిషస్ పర్యటనలో ప్రధాని మోడీ

**అత్యున్నత పురస్కారంతో సత్కారం**

**న్యూఢిల్లీ:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మారిషస్ దేశ అత్యున్నత పురస్కారం దక్కింది. తమ దేశ అత్యున్నత పురస్కారం ‘ది గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ అండ్ కీ ఆఫ్ ది ఇండియన్ ఓషన్‘ను మోదీకి ఆ దేశ ప్రధాని నవీన్ రామ్‌గులాం ప్రకటించారు. ఈ గౌరవాన్ని దక్కించుకున్న తొలి భారత ప్రధానిగా మోదీ ఘనత సాధించారు. ప్రస్తుతం మారిషస్ పర్యటనలో ఉన్న మోదీ.. ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గులాం, ఆయన సతీమణి వీణా రామ్‌గులాంలకు ’ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా (ఓసీఐ)’ కార్డులు ప్రకటించారు. పర్యటనలో భాగంగా అక్కడున్న భారతీయులతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం సరిగ్గా ఇదే రోజున మారిషస్‌కి వచ్చాను. అప్పటికీ హోలీకి పది రోజులే ఉంది.

ఈ సారి హోలీ రంగులను నాతో పాటు భారత్‌కు తీసుకెళ్తా. ఈ ప్రాంతానికి వస్తే నా సొంత ప్రదేశంలా అనుభూతి కలుగుతుంది. మనమంతా ఒకే కుటుంబం అంటూ ప్రసంగించారు. అనంతరం.. తనను అత్యుత్తమ పురస్కారంతో సత్కరించిన మారిషస్ ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.



## పాక్‌లో ప్రయాణికులతో రైలు కిడ్నాప్

2వ




## పసుపు రైతుల ఆందోళన కనిపించడం లేదా

**ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మెల్సీ కవిత**

వేగుచుక్క

# రెండునెలల్లో ట్రిపుల్ ఆర్‌కు అనుమతులు

**న్యూఢిల్లీ:** రీజినల్ రింగ్‌రోడ్డు కు సంబంధించిన అన్ని అనుమతులు రెండు నెలల్లో ఇస్తామని, అన్ని క్లియరెన్స్‌లు వచ్చాక ప్రధాని దృష్టికి తీసుకెళ్తామని కేంద్ర మంత్రి గడ్కరీ హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రీజినల్ రింగ్‌రోడ్డు, హైవేల కోసం గడ్కరీతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'సంగారెడ్డి – భువనగిరి – చౌటుప్పల్ వరకు ఆర్‌ఆర్‌ఆర్ టెండర్ల పక్రియ పూర్తయింది. దాదాపు 95శాతం భూ సేకరణ కూడా పూర్తయింది. రూ.వెయ్యి కోట్లతో 12 ఆర్వోబీలు కూడా మంజూరు చేశారు. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి ఆరు లేన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గడ్కరీ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు రోడ్డు విస్తరణ ఆలస్యమవుతున్నందున.. గుడిమల్కాపూర్ నుంచి విజయవాడ వరకు ఒక ప్యాకేజీ, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు మరో ప్యాకేజీగా విభజించి టెండర్లు పిలవాలని అధికారులను గడ్కరీ ఆదేశించారు. 62 కి.మీ మేర శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని కేంద్ర మంత్రి చెప్పారు' అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

## అమెరికా స్టాక్ మార్కెట్లలో భారీ కుదుపు

న్యూయార్క్: అమెరికా స్టాక్ మార్కెట్లు దాదాపు 20 రోజుల వ్యవధిలోనే భారీగా పతనం అయ్యాయి. స్టాక్స్‌లోని మదుపర్ల సంపద 4 ట్రిలియన్ డాలర్ల మేర అంటే దాదాపు రూ.349 లక్షల కోట్లు మేరకు ఆవిరైపోయింది. ఇది యూకే, ఫ్రాన్స్ వంటి దేశాల జీడీపీ కంటే ఎక్కువ కావడం గమనార్హం. ముఖ్యంగా అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్ భయాలు సూచీలను వెంటాడుతున్నాయి. దీనికి ట్రంప్ అస్థిర విధానాలు తోడయ్యాయి. ఓవైపు మారెట్లు పతనం అవుతున్నా.. ఆర్థిక వ్యవస్థ మాత్రం బలంగానే ఉందని శ్వేతసౌధంలోని ది నేషనల్ ఎకనామిక్ కౌన్సిల్ అధిపతి కెవిన్ హస్సెట్ట్ చెప్పారు. ఆర్థిక మాంద్యం భయాలను తోసిపుచ్చారు. ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని చెప్పేందుకు పలు కారణాలున్నాయన్నారు. ఇక సుంకాల విషయంలోని అస్పష్టత త్వరలోనే తొలగిపోతుందన్నారు. ఇక పన్ను కోతలు పెట్టుబడులను ప్రోత్సహిస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లపై తీసుకొనే నిర్ణయం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎస్‌అండ్‌పీ 500 సూచీ ఫిబ్రవరి 19వ తేదీన నమోదు చేసిన ఆల్‌టైమ్ హై నుంచి ఇప్పటికి 8 శాతానికిపైగా విలువ కోల్పోయింది. నాస్‌డాక్ కాంపోజిట్ డిసెంబర్‌లో నమోదుచేసిన అత్యధిక విలువ నుంచి 10శాతం పతనమైంది. ఇక ఒక్క సోమవారమే 1.7 ట్రిలియన్ డాలర్ల సంపద కరిగిపోయింది. 2022 సెప్టెంబర్ తర్వాత ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. ఇక మస్క్ నేతృత్వంలోని టెస్లా షేర్ ధర 15శాతం పతనం కావడం గమనార్హం. డిసెంబర్ 17 నుంచి ఈ సంస్థ షేరు విలువ 50శాతం ఆవిరైంది. నాడు అత్యధికంగా 479.86 డాలర్లు ఉండగా.. నేడు అది 222.15 డాలర్లకు చేరింది. వివిధ కారణాలు కలిసి ఓ ప్యాకేజీలా మార్కెట్లను దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా వాణిజ్య విధానాల్లో హఠాత్తుగా వస్తున్న మార్పులు, ఆర్థిక మాంద్యం భయాలు, స్టాక్స్ అధిక విలువలు వంటివి కారణమవుతున్నాయని లాజర్డ్ సీఈవో పీటర్ ఓర్స్‌జాగ్ వెల్లడించారు. ముఖ్యంగా ప్రధాన వాణిజ్య భాగస్వాములైన కెనడా, మెక్సికో, ఐరోపాతో వాణిజ్య యుద్ధాల వల్ల చాలా కంపెనీలు తమ వ్యాపార వ్యూహాలను పునఃపరిశీలిస్తున్నాయన్నారు. అమెరికాలోని భారీ సంపన్నులపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటోంది. అక్కడి మార్కెట్లలో 50 శాతం విలువైన సంపద 1శాతం మంది వద్ద ఉంటుంది. ఇక 37శాతం విలువైన సంపద 10శాతం మంది వద్ద ఉంటుంది. 12శాతం వాటా 40శాతం మంది వద్ద కేంద్రీకృతమైంది. మిగిలిన 1శాతం వాటా 50శాతం మంది ప్రజల చేతిలో ఉందని ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ సెయింట్ లూయిస్ డేటా పేర్కొంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశం మార్పు దశలో ఉందని ఓ టీవీ షోలో అభివర్ణించారు. అదే సమయంలో ఆర్థిక మాంద్యం రాదని కచ్చితంగా చెప్పలేదు. యాంకర్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. తాను అలాంటి విషయాలను ఊహించడాన్ని కూడా ఇష్టపడనని చెప్పారు. ఇప్పుడు తమ ప్రభుత్వం చాలా పెద్దపని చేపట్టిందని.. ఈ క్రమంలో మార్పు దశ ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్ పతనానికి, ఆర్థిక మాంద్యానికి ట్రంప్ సర్కారు సిద్ధమైందనే సంకేతాలున్నట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. గోల్డ్‌మన్ శాక్స్ కూడా అమెరికాలో వచ్చే 12 నెలల్లో ఆర్థిక మాంద్యం వచ్చేందుకు 15–20శాతం అవకాశాలున్నాయని అంచనా వేసింది.

## పసుపు రైతుల ఆందోళన కనిపించడం లేదా



నిజామాబాద్: నిజామాబాద్ పసుపు రైతుల ఆందోళనలు రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. పసుపు రైతుల ఆందోళనపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. గిట్టుబాటు ధర రాక పసుపు రైతులు అల్లాడుతుంటే రేవంత్ ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. మాటలు చెప్పిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడానికి ఎందుకు ముందుకు రావడం లేదని కవిత ప్రశ్నించారు. క్వింటా పసుపు పంటకు రూ.15 వేల ధర కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు పసుపు పంటకు కనీసం రూ. 9 వేలు రాని పరిస్థితి ఉందన్నారు. అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడానికి చర్యలు తీసుకోకపోవడం దారుణమని ధ్వజమెత్తారు. ఇది రైతులను నయవంచన చేయడమే, మోసం చేయడమేనని కవిత విమర్శించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేల మద్దతు ధర చెల్లిస్తూ పసుపు పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డు తీసుకువచ్చామని చెబుతున్న బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ కనీసం రైతులను పరామర్శించడం లేదని మండిపడ్డారు. పసుపు బోర్డుకు చట్టబద్ధత లేకపోవడంతో రైతులకు ప్రయోజనాలు కలగడం లేదని అన్నారు. పసుపు పంటకు ధరలు పెంచుతామని, మరిన్ని ప్రయోజనాలు కల్పిస్తామని పసుపు బోర్డు ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి బండి సంజయ్ చెప్పారని .. కానీ ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ముందుకు వచ్చి పసుపు రైతులను ఆదుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

# జిల్లాలో సాగునీటికి ఇబ్బంది లేదు

<u>యాసింగి సాగులో సరిపడా నీటి లభ్యత</u>

<u>రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు</u>

<u>జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టీకరణ</u>



నల్లగొండ: నల్లగొండ జిల్లాలో ఆయా ప్రాజెక్టుల కింద సాగు చేస్తున్న పంటలకు సాగునీరు అందించేందుకు ఇబ్బంది లేదని,ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. యాసంగి సాగులో ఉన్న పంటలకు సాగునీరు అందడం లేదని వస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దన్నారు. రైతులను తప్పుదోవ పట్టించేలా దుష్ప్రచారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు, ఉదయ సముద్రం ప్రాజెక్టుల కింద ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు ఎలాంటి నీటి కొరతలేదని ఆమె స్పష్టం చేశారు. రబి పంటలకు సాగునీటి విడుదల నిర్వహణపై మంగళవారం రాష్ట్ర మంత్రులు, చీఫ్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన నేపథ్యంలో మంత్రుల ఆదేశాల మేరకు నల్లగొండ పట్టణ సమీపంలో ఉన్న ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ను ఇరిగేషన్, రెవెన్యూ వ్యవసాయ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 1.5 టిఎంసిల నీటికి గాను 0.86 టీఎంసీల నీటిని ఉదయ సముద్రం ద్వారా వదలడం జరుగుతున్నదన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు కింద ఉన్న 67,000 ఎకరాలకు ఈ నీరు సాగుబడికి వార బంది ప్రకారం పంట కోత వచ్చేవరకు ఇస్తామని తెలిపారు. అందువల్ల రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. ఉదయ సముద్రం డి–40 కింద ఉన్న 11 –ఎల్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

అనంతరం మాట్లాడుతూ 11 ఎల్ కింద ఉన్న మామిడాల, సర్వారం, ఇందుగుల, గోరింకలపల్లి గ్రామాలన్నిటికీ వారబంది ద్వారా నీరు వస్తుందని, ఈ గ్రామాల తర్వాత కూడా సాగునీరు అందుతుందని స్పష్టం చేశారు. ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించేందుకుగాను రెవెన్యూ ,ఇరిగేషన్, వ్యవసాయ అధికారులతో సంయుక్తంగా ఉదయ సముద్రం ను సందర్శించడం జరిగిందని తెలిపారు. ప్రాజెక్టు కింద నీటి కొరత గాని, తేమ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని, ఫిబ్రవరి నుండి ఎండలు తీవ్రమైన దృష్ట్యా కొంతవరకు నీరు తగ్గిన మాట వాస్తవమని ఆమె తెలిపారు. ఉదయ సముద్రంకు సాగునీటిని విడుదల చేసిన తర్వాత 30? భూగర్భ జలాలు పెరిగాయని అందువల్ల ఉదయ సముద్రం చుట్టుపక్కల రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని చెప్పారు.ఇరిగేషన్, పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులందరూ సాగునీటిని ఎప్పటికప్పుడు నియంత్రణ చేస్తున్నట్లు, ఏ ప్రాంతానికి ఎంత నీటిని ఇవ్వాలనే విషయంపై ప్రతి రోజు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతులు, ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. జిల్లాలోని అన్ని మండల వ్యవసాయ అధికారుల కార్యాలయాలలో ఫిర్యాదుల విభాగాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వ్యవసాయానికి సంబంధించి సాగునీరు, తాగునీటి విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదులు సమర్పించవచ్చని, తక్షణమే సంబంధిత శాఖల అధికారులు

పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నకిరేకల్, మునుగోడు, నల్లగొండ నియోజకవర్గాల్లోని కెనాల్స్ ద్వారా సాగు చేసే భూములకు ఎలాంటి సాగునీటి కొరతలేదని, 10 రోజుల్లో ఇక్కడ కోతలు కూడా పూర్తికానున్నట్లు తెలిపారు. అయితే దేవరకొండ, మిర్యాలగూడ తదితర ప్రాంతాల్లో సాగు చేస్తున్న వేరుశనగ పంటలు ఆలస్యంగా సాగు చేశారని, అక్కడ కూడా పంటలు ఎండిపోకుండా రైతులు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, ఉదయ సముద్రం ఈఈ శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్ వెంట ఉన్నారు.

## అరవింద్ కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ

**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్ కు ఎదురుదెబ్బ తగిలింది. కేజ్రివాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ 2019లో దాఖలైన పిటిషన్‌పై విచారణకు రౌస్ అవెన్యూ కోర్టు అనుమతించింది. మార్చి 18వ తేదీలోగా కేజ్రివాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులను అదేశించింది. కేజ్రివాల్, ఆప్ మాజీ ఎమ్మెల్యే గులాబ్ సింగ్, మాజీ ద్వారక కౌన్సిలర్ నితిక శర్మ ఉద్దేశపూర్వకంగానే ప్రజా నిధులను దుర్వినియోగం చేస్తూ ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో భారీ హోర్డింగ్‌లు పెట్టారని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరందరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టును కోరారు. దీనిపై అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ నేహా మిట్టల్ మంగళవారం నాడు ఢిల్లీ పోలీసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ ఆదేశాలిచ్చారు. దీనికి ముందు 2022లో ఈ ఫిర్యాదును మెట్రోపాలిటన్ మెజిస్ట్రేటు తోసిపుచ్చారు. అయితే సెషన్ కోర్టు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తూ పిటిషన్‌ను పునఃపరిశీలించాలని మెజిస్ట్రేట్‌ను ఆదేశించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 'ఆప్' పదేళ్ల పాలనకు బీజేపీ గండికొడుతూ ఘనవిజయం సాధించింది. ఈ క్రమంలో హోర్డింగ్‌ల పేరుతో ప్రజానిధుల దుర్వినియోగంపై కేజ్రివాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు కోర్టు ఆదేశాలివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## కమాండెంట్ గంగారం మృతి కెటిఆర్ తీవ్ర సంతాపం

**సిరిసిల్ల:** తెలంగాణ సచివాలయ మాజీ సీఎస్ఓ, 17వ పోలీసు బెటాలియన్ కమాండెంట్ గంగారాం (58) మృతి చెందారు. లిఫ్ట్ లో పడి ఆయన దుర్మరణం చెందారు. ఈ ఘటనపట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. పోలీసు శాఖకు ఉన్నతంగా సేవలందిస్తున్న గంగారాం మరణించడం బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ గంగారాం సోమవారం రాత్రి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. సోమవారం రాత్రి తన బ్యాచ్ మెంట్ అయిన సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి నివాసానికి వెళ్లారు. స్నేహితుడిని కలిసి తిరిగి ఇంటికి బయల్దేరారు. ఈ క్రమంలో లిఫ్ట్ ఎక్కేందుకు బటన్ నొక్కగా.. డోర్ తెరచుకుంది. లిఫ్టు రాకపోయినా గేటు తెరచుకోవడంతో అది గమనించని గంగారాం మూడో అంతస్తు నుంచి గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న లిఫ్ట్‌పై పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించేలోపే గంగారాం మృతిచెందారు.

## పోలవరం ఎత్తును తగ్గించరాదు

**న్యూఢిల్లీ:** పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గింపు, బడ్జెట్ లో పోలవరంకు కేటాయించిన నిధులు, పెరిగిన పోలవరం ప్రాజెక్టు ఖర్చు, విద్యారంగం తదితర అంశాలపై వైఎస్సార్‌సీపీ తన గళం వినిపించింది. ఉభయ సభల్లోనూ వైఎస్సార్‌సీపీ ఎంపీలు కొన్ని కీలకాంశాలు లేవనెత్తారు. మంగళవారం పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీ గురుమూర్తి.. లోక్‌సభలో మాట్లాడుతూ.. 'పోలవరం ఎత్తును 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు తగ్గించారు. పోలవరం ఎత్తు తగ్గించడం వల్ల స్టోరేజ్ కెపాసిటీ 194 నుంచి కేవలం 115 టీఎంసీలకే పరిమితమవుతుంది. దీనివల్ల సాగునీరు, తాగు నీటికి , విద్యుత్తు ఉత్పత్తి పైన తీవ్ర ప్రభావం పడుతుంది. ఒరిజినల్ పోలవరం డ్యాం ఎత్తు ప్రకారమే నిర్మించాలన్నారు. ఇటీవలబడ్జెట్‌లో పోలవరంకు అరకొరగా రూ. 5936 కోట్లు మాత్రమే కేటాయించారు. పెరిగిన పోలవరం ఖర్చును ఎవరు భరిస్తారు?, పోలవరం సిఈఓ ఆఫీస్ ను ఏపీకి తరలించాలి. ఏపీలో 17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుమతులు తీసుకుంది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం లేఖతో కడప మెడికల్ కాలేజీ పర్మిషన్ ను ఉపసంహరించారు. మౌలిక వసతులు లేవనే రాష్ట్ర ప్రభుత్వం లేఖతో ..మెడికల్ కాలేజీలకు పర్మిషన్ వెనక్కి తీసుకోవడం చరిత్రలో ఇదే తొలిసారి. 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయకూడదు. వైజాగ్ స్టీల్ ఎ÷–లాంట్ ను ప్రైవేటీకరణ చేస్తారా లేదన్న అంశంపై కేంద్రం స్పష్టత ఇవ్వాలి. వైజాగ్ స్టీల్ ఎ÷–లాంట్ కు సొంత గనులు ఇస్తారా లేదో చెప్పాలి. దుగ్గరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ఎ÷–లాంట్ ఏర్పాటు చేయాలి. విభజన చట్టం ప్రకారం ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి.

# సిటిజన్స్ అసోసియేషన్" కు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదు.

**<u>ఆర్ఎస్ యు, ఆర్ వై ఎల్ కమిటీల ప్రోద్బలంతో ఏర్పడిందనేది ఒక తప్పుడు వ్యాఖ్యానం.</u>**

**"50 సంవత్సరాల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం" అనే పుస్తకంలో <u>తప్పుగా రాశారు.</u>**

**వ్యాసకర్త తప్పుడు రాతల్ని <u>తీవ్రంగా ఖండిస్తున్నాం.</u>**

"సుమారు 40 సంవత్సరాల క్రితం 1985లో కొందరు ఉత్సాహవంతులైన, విద్యాధికులైన యువకులు , ఉపాధ్యాయులు, డాక్టర్లు, లాయర్లు కలిసి " కామారెడ్డి సిటిజన్స్ అసోసియేషన్" ఏర్పాటు చేసుకున్నాం. ఈ సంస్థ ప్రధాన ఆశయం కామారెడ్డి ప్రాంత పేద, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వ దృష్టికి తెచ్చి, ప్రజాస్వామిక పద్ధతుల ద్వారా పరిష్కారాలు చేయించడం కోసం కృషి చేయడం"

ఈ క్రమంలో కామారెడ్డి డిగ్రీ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనే ఉద్యమం, కామారెడ్డి ఆఫీసర్స్ క్లబ్ ప్రభుత్వ స్థలంలో ఉన్నందున ఆ భవనాన్ని ప్రభుత్వం సాధీనం చేసుకోవాలనే ఉద్యమం, సంపూర్ణ మద్యపాన నిషేధం కోసం జరిగిన ఉద్యమాలు, పార్లమెంటు– అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఉమ్మడి వేదికలు ఏర్పాటు చేయడం, కామారెడ్డి ఆల్కహాల్ ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం జరిగిన ఉద్యమం, బీడీ కార్మికులు, వృత్తి కార్మికుల హక్కుల కోసం జరిగిన ఉద్యమాలు, లారీ డ్రైవర్స్ సమస్యల కోసం, వారి హక్కుల కోసం జరిగిన ఉద్యమాలలో సిటిజన్స్ అసోసియేషన్ చురుకుగా పాల్గొన్నది.

1990 సంవత్సరంలో కామారెడ్డి పట్టణానికి నీటి ఎద్దడి తీర్చడం కోసం బుర్ర మత్తడి నుండి వచ్చే పైప్ లైన్ గురించి కిష్టమ్మ గుడి వద్ద గల దర్గా వద్ద ఏర్పడ్డ రెండు వర్గాల మధ్య ఘర్షణ తలఎత్తినప్పుడు సిటిజన్స్ అసోసియేషన్ పూనుకొని సామరస్యంగా పరిష్కరించింది. గతంలో రామ జన్మభూమి– బాబ్రీ మసీదు సమస్య వచ్చినప్పుడు "మందిరం కాదు – మసీదు కాదు , శాంతి కావాలని" ప్రజల్లో ఐక్యత కోసం కరపత్రం ద్వారా చైతన్యం చేశాము. అంతర్జాతీయంగా దేశాల మధ్య యుద్ధాలు జరిగినప్పుడు కువైట్ – పాలస్తీనా వంటి పేద దేశాలకు మద్దతుగా సెమినార్లు నిర్వహించాము. కెన్యా దేశానికి చెందిన కెన్సారో వివా అనే పర్యావరణ ఉద్యమ కారుని అక్రమంగా ఉరి తీసినప్పుడు కామారెడ్డిలో నిరసన సభను ఏర్పాటు చేశాం. భారతదేశ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే "డంకల్ ప్రతిపాదనలు" 1990 దశాకంలో నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో ఈ ప్రాంతంలోని రైతులతో కిష్టమ్మ గుడిలో సదస్సు ఏర్పాటు చేసి రైతులను చైతన్యం చేసాము.

కామారెడ్డి ప్రాంతంలో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్న నేపథ్యంలో "రైతు ఆత్మ హత్యల నిరోధక కమిటీ" ద్వారా చైతన్యం కల్పించి, సమస్యలకు పరిష్కారం జీవితాన్ని అంతం చేసుకోవడం కాదని, ధైర్యంగా సమస్యను ఎదుర్కోవాలని తెలిపాము.


తెలంగాణ మలిదశ పోరాటం ప్రారంభానికి ముందే సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతను చాటడానికి ఉద్యమ రచనలు చేయడానికి 2004లో కామారెడ్డి లో సదస్సు నిర్వహించాము. ఈ సదస్సు ఇచ్చిన చైతన్యమే రాబోయే తెలంగాణ పోరాటానికి కర్టెన్ రైజర్ గా పనిచేసింది.

మలిదశ తెలంగాణ ఉద్యమం పునాది వర్గాలలో విస్తరించడానికి కృషిచేసిన జేఏసీ కన్వీనర్ బాధ్యతను సిటిజన్స్ అసోసియేషన్ స్వీకరించి ఉద్యమాన్ని తీవ్రతరం చేయడానికి కృషి చేసింది. సిటిజన్స్ అసోసియేషన్ నిర్వహించిన ఉద్యమాలలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, దళిత బహుజన సంస్థలు ఒకే గొంతుకగా పనిచేశాయి. ఈ సంస్థల నుంచి మేము అనేక విషయాలు నేర్చుకున్నాం. ఉమ్మడి నాయకత్వాన్ని రూపొందించడానికి ఈ ఉద్యమాలు ఎంతో తోడ్పడ్డాయి. భిన్నమైన సిద్ధాంతాలు, భావజాలాలు కలిగిన రాజకీయ సంస్థలు ఒకే వేదికను పంచుకొని ప్రజల సమస్యలను పరిష్కరించడానికి సిటిజన్స్ అసోసియేషన్ చేసిన కృషి ఒక అరుదైన అపూర్వమైన అనుభవం.

కామారెడ్డి సిటిజన్స్ అసోసియేషన్ కు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని స్పష్టం చేయదలచుకున్నాం. కేవలం ప్రజల సమస్యలపై అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంస్థలు, సంఘాలతో కలిసి ఒక విశాలమైన ఉమ్మడి వేదిక నిర్మాణానికి కృషి చేసింది. ఈ సిటిజన్స్ అసోసియేషన్ సంస్థకు సంస్థకు ఏ పార్టీ కూడా దగ్గర కాదు , దూరం కాదని ఈ సందర్భంగా మేము ఒక ముఖ్యమైన విషయంగా దీన్ని స్పష్టం చేయదలచుకున్నాం.

ఇటీవల విడుదలైన "50 సంవత్సరాల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం" అనే పుస్తకంలో ఒక వ్యాసం వచ్చింది. వ్యాస రచయిత పి విజయరామరాజు మా సిటిజన్స్ అసోసియేషన్ ను ప్రస్తావిస్తూ ఆర్ఎస్ యు, ఆర్ వై ఎల్ కమిటీల ప్రోద్బలంతో ఏర్పడిందని ఒక తప్పుడు వ్యాఖ్యానం చేశాడు. దీన్ని అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోంది. మా సంస్థకు ఎలాంటి రాజకీయ పార్టీలతో, సంస్థలతో సంబంధం గానీ, అనుబంధం గానీ లేదని ఉండదని స్పష్టంగా ప్రకటిస్తున్నాం.

సిటిజన్స్ అసోసియేషన్ తన ప్రారంభం నుంచి కూడా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజా సమస్యలపై పనిచేస్తోంది. సమాజంలో ఉన్నతమైన, ఆత్మీయమైన మానవీయ విలువలు ఏర్పడడానికి కృషి చేస్తుందని తెలియజేస్తున్నాం.



జి. జగన్నాథం, అధ్యక్షుడు, సిటిజన్స్ అసోసియేషన్, కామారెడ్డి.

## పాక్‌లో ప్రయాణికులతో రైలు కిడ్నాప్

**లాహోర్:** పాకిస్థాన్‌లో రైలు హైజాక్‌కు గురైన ఘటన కలకలం సృష్టిస్తోంది. బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని వేర్పాటువాదులు ప్రయాణికుల రైలుపై దాడి చేశారు. వందల మందికి పైగా ప్రయాణికులను బందీలుగా తీసుకున్నామని ప్రకటించుకున్నారు. బలోచిస్థాన్‌లోని క్వెట్టా నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పెషావర్‌కు రైలు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. పెషావర్ వెళు తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై వేర్పాటువాదులు భారీస్థాయిలో కాల్పులు జరిపారని బలోచిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి షాహిద్ రిండ్ వెల్లడించారు. ఈ ఘటన గురించి తెలియగానే అత్యవసర చర్యలు తీసుకోవాలని స్థానిక యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. వేర్పాటువాద మిలిటెంట్ గ్రూప్ బలోచ్ లిబరేషన్ ఆర్మీ ఈ దాడికి బాధ్యత ప్రకటించుకుంది. తాము బందీలుగా తీసుకున్నవారిలో భద్రతాసిబ్బంది కూడా ఉన్నారని తెలిపింది. పక్కా ప్లానింగ్‌తో ఆ గ్రూప్ రైల్వేట్రాక్‌ను పేల్చివేయడంతో జాఫర్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. దాంతో మిలిటెంట్లు వెంటనే రైలును తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. ప్రయాణికులందరినీ బంధించారు. ఈ దాడిలో ఆరుగురు మిలిటరీ సిబ్బంది మృతి చెందినట్లు బీఎల్‌ఏ వెల్లడించింది. తమపై ఏదైనా మిలిటరీ ఆపరేషన్‌కు ప్రయత్నిస్తే.. ప్రయాణికులందరినీ చంపేస్తామని బెదిరించింది. ఈ ఘటనలో రైలు డ్రైవర్ గాయపడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఘటనాస్థలానికి సహాయక, భద్రతా సిబ్బంది చేరుకున్నట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. బందీలను విడిపించేందుకు పాక్ భద్రతాబలగాలు యత్నిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. బలోచిస్థాన్ వేర్పాటువాదులు పాక్‌లో వరుసగా దాడులకు పాల్పడుతున్నారు. పోలీస్ స్టేషన్లు, రైల్వేలైన్లు, వాహనాలపై దాడులు చేస్తున్నారు. సాయుధులు ప్రధాన హైవేను స్తంభింపజేసి బస్సులో నుంచి ప్రయాణికులను కిందకు దించి వారి గుర్తింపు కార్డులను చూసి మరీ కాల్చిచంపిన ఘటనలు చోటుచేసుకున్నాయి. బలోచ్ ప్రజల స్వయంనిర్ణయాధికారం, పాకిస్థాన్ నుంచి ప్రత్యేక ప్రాంత ఆవిర్భావాన్ని కోరుతూ బీఎల్‌ఏ 2000 సంవత్సరం ప్రారంభం నుంచి పాక్ సైన్యంపై దాడులకు పాల్పడుతోంది. పాక్‌తో పాటు అమెరికా, యూకే దీన్ని ఉగ్ర సంస్థగా ప్రకటించాయి.

వేగుచుక్క
సీనియర్ జర్నలిస్టుల గొంతుక...

# దక్షిణ ప్రాంగణాన్ని సందర్శించిన టియు వైస్ ఛాన్సలర్.

- బాలుర, బాలికల హాస్టళ్ళ పరిశీలన.
- విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా.

**వేగుచుక్క న్యూస్, భిక్నూర్, మార్చి 11:**





తెలంగాణ యూనివర్సిటీ దక్షిణ ప్రాంగణాన్ని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరిరావు సందర్శించారు. గతంలో దక్షిణ ప్రాంగణం ప్రిన్సిపల్ యూనివర్సిటీ వసతి గృహాలలో ఉన్న సమస్యలను వీసీ దృష్టికి తీసుకువెళ్లగా మంగళవారం వసతి గృహాలనును సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. చిన్న చిన్న సమస్యలైన డ్రైనేజీ లాంటి సమస్యలను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవికాలం వచ్చినందున విద్యార్థులకు నీటి సౌకర్యాన్ని సక్రమంగా అందించాలని ఆదేశించారు. ప్రాంగణంలోని బాలికల, బాలుర హాస్టళ్ల వంట శాలలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న భోజన సౌకర్యాన్ని అలాగే పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు కావలసిన సౌకర్యాలను కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామని విద్యార్థులు సౌకర్యాలు ఉపయోగించుకుని మంచి చదువు చదవాలని గొప్ప స్థాయికి ఎదగాలని కోరారు. వీసీ గారి వెంట యూనివర్సిటీ ఏఈ వినోద్, దక్షిణ ప్రాంగణం ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ గౌడ్, బాలుర బాలికల హాస్టల్ ల వార్డెన్లు డాక్టర్ యాలాద్రి, డాక్టర్ సునీత, డాక్టర్ మోహన్ బాబు, డాక్టర్ నాగరాజు, డాక్టర్ నారాయణ, డాక్టర్ రమాదేవి మరియు విద్యార్థులు ఉన్నారు.

# మహిళలు దాడులను ధైర్యంగా ఎదుర్కోవాలి.




**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి. పద్మావతి.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి11:**

సమాజంలో జరగుతున్న అనేక రకాల దాడులను మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాలని, న్యాయ వ్యవస్థలో అనేక హక్కులు ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి. పద్మావతి అన్నారు.ఐద్వా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మంగళవారం నగరంలోని ప్రెస్ క్లబ్ లో ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథులుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి. పద్మావతి,ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్ బీ, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ బండారి సుజాత, ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్, స్విమ్మర్ పూర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి పి .పద్మావతి మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాలలో ఎదుగుతున్నారని అన్నారు. మహిళాలకు ఉన్న సమస్యలను జిల్లా న్యాయ సలహా సంస్థలకు తెలియజేస్తే వారి సమస్యలను పరిష్కరించడం కోసం కృషి చేస్తామని అన్నారు.

**ఆడ మగ అనే భేదం వద్దు: డాక్టర్ బండారి సుజాత**

గైనకాలజిస్ట్ డాక్టర్ బండారి సుజాత మాట్లాడుతూ, మహిళలు స్వశక్తిగా ఎదగాలని, సొంత నిర్ణయాలు తీసుకునే విధంగా ఉండాలని హితవు పలికారు. టెక్నాలజీని అందుపుచ్చుకొని మహిళా హక్కులను తెలుసుకొని ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. తల్లిదండ్రులు ఆడ మగ అనే భేదం లేకుండా పిల్లల్ని సమానంగా చూసినప్పుడే ఈ సమాజం అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఉమెన్ వెల్ఫేర్ చైల్డ్ ఆఫీసర్ రసూల్ బి మాట్లాడుతూ మహిళల పై దాడులు జరిగితే సఖి సెంటర్ల ద్వారా మరియు అంగన్వాడీల ద్వారా సమాచారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అనిత, కార్యదర్శి సుజాత, స్వర్ణలత రేణుకా,కలా, రేఖ, శ్రీదేవి, విమల, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్.ఆర్.ఎస్ క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారుల చొరవ.

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.
- 25 శాతం రిబేటు సదుపాయాన్ని వినియోగించుకోవాలని హితవు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 11 :**



జిల్లాలో లేఔట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్.ఆర్.ఎస్) కోసం దరఖాస్తు చేసుకున్నవారు పూర్తి స్థాయి ఫీజు చెల్లించి ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు చొరవ చూపుతున్నారని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఈ నెల (మార్చి) 31 లోపు పూర్తి స్థాయి ఎల్.ఆర్.ఎస్ ఫీజుతో పాటు ప్రో-రాటా ఓపెన్ స్పేస్ చార్జీలను చెల్లించే వారికి ప్రభుత్వం 25 శాతం రిబేటు వర్తింపజేస్తోందని గుర్తు చేశారు. దీంతో దరఖాస్తుదారులు ఫీజు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు స్వతహాగా ముందుకు వస్తున్నారని అన్నారు. ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు రిబేటును మినహాయిస్తూ, వెంటదివెంట ల్యాండ్ రెగ్యులరైజెషన్ కు సంబంధించిన ప్రొసీడింగ్ లు జారీ చేయడం జరుగుతోందని కలెక్టర్ వివరించారు. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో 190 మంది ఎల్.ఆర్.ఎస్ ఫీజు చెల్లించి తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్నారని తెలిపారు. ఇందులో రిబేట్ ప్రకటించిన తరువాత 65 మంది ఫీజు చెల్లించారని, మంగళవారం ఒక్క రోజే 15 మంది దరఖాస్తుదారులు తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకున్నారని వివరించారు. అదేవిధంగా భీంగల్ మున్సిపాలిటీ పరిధిలో 26 మంది, బోధన్ లో 104 మంది ఎల్.ఆర్.ఎస్ ఫీజు చెల్లించారని తెలిపారు. నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటివరకు 895 మంది ఫీజు చెల్లింపులు పూర్తి చేశారని, ఎల్.ఆర్.ఎస్ కింద రూ. 12.45 కోట్ల రుసుము వసూలయ్యిందని కలెక్టర్ వివరించారు. మిగితా దరఖాస్తుదారులు కూడా నిర్ణీత గడువు లోపు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించి తమ ప్లాట్ల క్రమబద్ధీకరణ చేసుకోవాలని, రిబేటు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని హితవు పలికారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయించామని, దరఖాస్తుదారులు సంప్రదించవచ్చని సూచించారు. బఫర్, ఎఫ్.టి.ఎల్, చెరువులు, కుంటలు వంటి నిషేధిత జాబితాలోని ప్రాంతాలను మినహాయిస్తే, ఇతర ప్రాంతాలలోని ప్లాట్లకు ఆన్లైన్ లో సులభంగా అనుమతి లభిస్తోందని అన్నారు. చెరువులు, నీటి వనరులకు సమీపంలో కనీసం 200 మీటర్ల దూరంలో ఉన్న స్థలాలకు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అనుమతులు తప్పనిసరి అని కలెక్టర్ వెల్లడించారు. ఎల్ ఆర్ ఎస్ అర్హత లేని స్థలాలపై చెల్లించిన ఫీజులలో 90% రిఫండ్ అవుతుందని, 10 శాతం ప్రాసెసింగ్ చార్జెస్ కింద తీసుకుంటారని అన్నారు . స్థలాల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించిన వారికి అర్హత ఉంటే స్థల క్రమబద్ధీకరణ చేసి సంబంధిత ప్రొసీడింగ్స్ జారీ చేస్తున్నామని అన్నారు. ఎల్.ఆర్.ఎస్ అనుమతులు లేని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతులు ఇవ్వబడవని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమ బద్ధీకరణ చేసుకోవాలని, మార్చి 31 వరకు ప్రభుత్వం కల్పించిన రిబేటు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 25 శాతం రాయితీ పొందాలని కలెక్టర్ సూచించారు.

# జగన్ పాలనలో వ్యవసాయానికి పెద్దపీట

**రైతులను అన్ని విధాలా ఆదుకున్నాం**

**మండలిలో వ్యవసాయపై చర్చలో బొత్స, వరుదు కళ్యాణి**

అమరావతి: గతంలో మా ప్రభుత్వంలో అనుసరించిన వ్యవసాయ విధానాలను నీతి ఆయోగ్ కూడా ప్రశంసించిందని మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. విపత్తు వస్తే సీజన్ ముగిసేలోపు పరిహారం అందించామన్నారు. విత్తనాలు, ఎరువులు రైతుల వద్దకే తీసుకెళ్లి అందించాం.. మేం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మేలు చేశాం.. వైసీపీ అధికారంలోకి వచ్చే నాటికి సివిల్ సప్లై డిపా÷-టం÷-మెంట్ చెల్లించాల్సిన బకాయిలు 5286 కోట్ల రూపాయలు అని మాజీ మంత్రి బొత్స అన్నారు. శాసనమండలిలో వ్యవసాయ సంక్షోభంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు.. గత ప్రభుత్వంలో రైతులను సకాలంలో ఆదుకున్నాం అని అన్నారు.
ఇక, వైసీపీ కార్యకర్తలు ఆత్మహత్య చేసుకుంటే రైతుల పేరుతో డబ్బులు తీసుకున్నారనడం కరెక్ట్ కాదు అని ఎమ్మెల్సీ బొత్స. ఇలా మాట్లాడటం రైతులను అవమానపరచడమే.. అధికారుల దగ్గర ఆత్మహత్యలు చేసుకున్న రైతుల లెక్కలు ఉన్నాయి.. మా హయంలో పెండింగ్ లో ఉన్న చెల్లింపులు కూడా మేం వచ్చాక చేశాం.. ఆ లెక్కలు కూడా మా దగ్గర ఉన్నాయని ఆయన చెప్పుకొచ్చారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రైతులకు మేలు జరగాలి అని బొత్స సత్యనారాయణ తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి కూటమి ప్రభుత్వం రైతులకు ఇస్తానన్న రూ. 20 వేలు ఇవ్వకుండా ఇప్పుడు మాట మార్చడంపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి తీవ్రంగా తప్పుబట్టారు. రైతులకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు కేంద్రం ఇచ్చే నిధులతో కలిపే అనడం కచ్చితంగా రైతును మోసం చేయడమేని వరుదు కళ్యాణి ఆక్షేపించారు. మంత్రి అచ్చెన్నాయుడి వ్యాఖ్యలు తీవ్ర నిరాశను కల్గించాయి. పెట్టుబడి సాయం రూ. 20 వేలు ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారు. ఇప్పుడు కేంద్ర సాయంతో కలిపి రూ. 20 వేలు అంటున్నారు. మండలి సాక్షిగా రైతుకు వెన్నుపోటు పొడిచారు. ఈ ప్రభుత్వం రైతులను మోసం చేసింది. అన్నమో రామచంద్రా అనే పరిస్థితిని రైతుకు తీసుకొచ్చారు. జగన్ మోహన్ రెడ్డి పాలనలో వ్యవసాయం పండుగలా సాగిందన్నారు. కూటమి పాలనలో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. గత ప్రభుత్వం పాలనలో నాణ్యమైన విత్తనాలు అందించారు. కూటమి పాలనలో నాణ్యమైన విత్తనాలే దొరకలేదు. పంటలకు గిట్టుబాటు ధర లేదు. కరువు సాయం లేదు.. క్రాప్ ఇన్సూరెన్స్ లేదు. మిర్చికి గతంలో రూ. 21 వేలకు పైగా మద్దతు ధర ఉంది. వైఎస్ జగన్ మిర్చి యార్డ్ ను సందర్శించే వరకూ ఈ ప్రభుత్వంలో కదిలిక రాలేదు. కూటమి ప్రభుత్వం చేసే సమీక్షలు రైతుకి మేలు చేయడానికా?.. కాలక్షేపానికా?' అని ప్రశ్నించారు. రూ. 8కి టమోటా కొంటామని చెప్పారు.

# పసుపు సిండికేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి.

**సాంగ్లీ మార్కెట్ లో ఉన్న ధరల ప్రకారంగా పసుపు ను కొనుగోలు చేయాలి.**

**నిజామాబాద్ లో పసుపు బోర్డు ఏర్పాటుచేసిన ఉపయోగం శూన్యం.**

**ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి. ప్రభాకర్.**

**కొనుగోలు దారులపై చర్యలు తీసుకుంటే రేపు ఎవరు కొనేది అన్న మార్కెట్ చైర్మన్ పై రైతుల అగ్రహం.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 11:**



సాంగ్లీ మార్కెట్ లో ఉన్న ధరల ప్రకారంగా నిజామాబాద్ రైతుల నుండి పసుపు ను కొనుగోలు చేయాలని, సిండికేట్ గా మారిన పసుపు కొనుగోలు దారులపై చర్యలు తీసుకోవాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి. ప్రభాకర్ డిమాండ్ చేశారు. పసుపు రైతుల సమస్యలపై మంగళవారం మార్కెట్ యార్డు లో ఎఎంసి చైర్మన్ ముప్పగంగా రెడ్డి తో రైతు నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు నాయకుడు ప్రభాకర్ మాట్లాడుతూ, నిజామాబాద్ మార్కెట్ కమిటీ లో పసుపుకు ధరలు రాకుండా కొనుగోలు దారులు సిండికేట్ గా మారి పసుపు రైతులని నిండా మంచుతున్నారని అన్నారు. సాంగ్లీ తదితర మార్కెట్లో పదిహేను వేల ధర ఉన్న పసుపు నిజామాబాద్ మార్కెట్లో ఎనిమిది తొమ్మిది, వేలు కూడా పలకడం లేదన్నారు. పసుపు పంట తొమ్మిది నెల్లకు వస్తుందని, పెట్టుబడి 1,70,000 సుమారుగా అవుతుందని, అయినా రైతుకు ప్రస్తుతం మార్కెట్లో ఏమాత్రం ధరలు లేక చేతి ఖర్చులు కూడా వెళ్లడం గగనమైన పరిస్థితి ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశించిన వ్యవసాయ మార్కెట్ అధికారుల్లో చలనం లేదన్నారు. సిండికేట్ గా మారిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని అనేక ధపాలుగా వినతి పత్రాలు అందజేసిన వారిపై ఎలాంటి చర్య లేకపోవడంతో పసుపు రైతులని దోపిడీ చేయడంలో బరితెగించి వ్యవహరిస్తున్నారు. పసుపు పంటకు మార్కెట్లో ధరలు లేక రైతులు రోజుల తరబడి పని కాపులు కాస్తున్నారు. ఇనాం పద్ధతిలో కోడ్ చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వ్యాపారులు ఆన్లైన్ పద్ధతి అయినా ఇనాంను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి సిండికేట్ గా వ్యవహరిస్తున్నారు. బయట రాష్ట్రాల కొనుగోలుదారులను కోడ్ చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పాత పద్ధతి అయిన అగ్రాస్ (బహిరంగ వేలం ) వల్ల రైతులకు ఎంతో ఉపయోగమన్నారు. పసుపుకు మార్కెట్లో మద్దతు ధర 15వేలు ఇవ్వాలి అని, ప్రభుత్వం పసుపు క్వింటల్ కు వేయి బోనస్ ఇవ్వాలి అని ఆయన డిమాండ్ చేశారు.

**చైర్మన్ పై రైతుల ఆగ్రహం**

కొనుగోలు దారులపై చర్యలు తీసుకోవాలి అని రైతులు డిమాండ్ చేయగా చర్యలు తీసుకుంటే రేపు ఎవరు కొనేది అన్న మార్కెట్ చైర్మన్ అనడం తో రైతులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు.
నిజామాబాద్ లో పసుపు బోర్డు ఏర్పాటు చేసిన మద్దత్తు ధరలు లేక రైతులకు ఉపయోగం శూన్యం అని అన్నారు.కార్యక్రమంలో రైతు జేఏసీ నాయకులు మంథని గంగారం(పిట్టే), జక్కా. లింగారెడ్డి, స్వామి యాదవ్ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ, జిల్లా నాయకులు బి. దేవారం, ఎస్. సురేష్, జీ. కిషన్, డివిజన్, మండల నాయకులు ఆర్. దామోదర్, బి.బాబన్న, బి. కిషన్, జి.సాయిరెడ్డి, బి. కిశోర్, ఎం. డి. అనిస్, పుట్టి. నాగన్న, టి. కృష్ణ గౌడ్. తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో రోడ్ల సమస్యను పరిష్కరించాలి.



**- అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ.**

**ఆర్ అండ్ బి అధికారులతో సమీక్ష.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 11:**

నగరంలో ని రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, గుంతల మయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. వెంటనే రోడ్ల నిర్మాణం పనులు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో మంగళవారం ఆర్ అండ్ బి అధికారులతో దన్ పాల్ సూర్య నారాయణ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, టియుఎఫ్ఐడిసి కింద డివిజన్ కి కోటి రూపాయల చొప్పున మంజూరు అయినా నిధుల పెండింగ్ విషయం గతంలో పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఇంచార్జి మంత్రి స్పందించి 38 కోట్ల రూపాయలు కార్పొరేషన్ లో డివిజన్ల అభివృద్ధికి మంజూరు
చేయడం జరిగిందన్నారు. టియుఎఫ్ఐడిసి కింద విడుదల అయినా నిధులను డివిజన్లో రోడ్స్, డ్రైనేజీ పనులు
పాక్షికంగా, అసంపూర్తిగా జరిగిన పనులను పూర్తి చేయాలనీ అధికారులకు సూచించారు. కాంట్రాక్టర్లు పనులు నాణ్యతతో చేపట్టాలని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ప్రజా ఉపయోగం లోకి తీసుకురావాలని అన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు చిత్తశుద్ధితో పని చేయాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ శ్రీమాన్ నారాయణ, డిఈ ప్రవీణ్, మునిసిపల్ డిఈ రషీద్, కాంట్రాక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ యూనివర్సిటీ పేరును మార్చొద్దు.

**పి.డి.ఎస్.యూ ఆధ్వర్యంలో ధర్నా.**

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, మార్చి 11**




"తెలంగాణ" అనే పదం ఉద్యమానికి ప్రతీక, చిరస్మరణీయమైనటువంటి పేరును మార్చి ఈశ్వరి బాయి యూనివర్సిటీ గా మార్చలని చూడటం సరైంది కాదని పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. యూనివర్సిటీ పేరును ఎట్టి పరిస్థితుల్లో మార్చొద్దని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం టీయూ కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ, 1960 నుంచి 2014 వరకు సుదీర్ఘ చరిత్ర కలిగిన తెలంగాణ పేరును మార్చటం అంటే తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతియటమే అన్నారు. ఎంతో మంది త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తి కలిగిన తెలంగాణ పేరును అలాగే ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఎవరు అధికారంలోకి వస్తే వాళ్ల తల్లిదండ్రుల పేర్లు ప్రభుత్వ సంస్థలకు పెట్టుకోవడం పద్ధతి కాదని విమర్శించారు.
ప్రతి రాష్ట్రంలో ఆ రాష్ట్రం పేరుతో అనేక యూనివర్సిటీలు దేశంలో ఉన్నాయని, మన రాష్ట్రంలో ఏకైక యూనివర్సిటీ కి తెలంగాణ అని పేరు ఉందని దీన్ని కూడా మారిస్తే చరిత్ర కలిగిన రాష్ట్రానికి అవమానకరమని అన్నారు.

**రిజిస్ట్రార్ కు పిడిఎస్ యూ, ఎస్ఎఫ్ఐ వినతి.**

జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీ పేరును మార్చాలని ఆలోచన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని పిడిఎస్ యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం యూనివర్సిటీ రిజిస్టర్, ప్రొఫెసర్ యాదగిరికి వినతి పత్రం అందజేశారు .ఈ సందర్భంగా పిడి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్, ఎస్ ఎఫ్ ఐ యూనివర్సిటీ అధ్యక్షులు జే. శివ మాట్లాడుతూ, ఎన్నో ఉద్యమ పోరాట ఫలితంగా, ఎంతోమంది బలిదానాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందని అన్నారు. అదే ఉద్యమ స్ఫూర్తితో నిజామాబాద్ జిల్లాలోని విద్యార్థులు, విద్యార్థి నాయకులు, ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు అందరూ కలిసికట్టుగా ఉద్యమ చేయడం వలన ఈ తెలంగాణ యూనివర్సిటీ జిల్లాలో సాధించుకోవడం జరిగిందన్నారు. కానీ ఉద్యమ స్ఫూర్తిని నీరుగార్చే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ యూనివర్సిటీ పేరును మార్చాలని ఆలోచన దుర్మార్గమైనదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ యూనివర్సిటీ పేరును మార్చాలి అనే ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

